

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 05-11-2025 | సంపుటి - 25 | సంచిక -170 | రూ : 4 | పేజీలు: 8




2లో

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధుల భేటీ

- తెలంగాణలో ఏడబ్ల్యూఎస్ సెంటర్లు, విస్తరణపై చర్చ
- పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ
- ముఖ్యమంత్రితో జర్మనీ కాన్సుల్ జనరల్ బృందం భేటీ

## నవంబర్ 6 నుంచి ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను విచారించనున్న స్పీకర్

- నవంబర్ 6, 7, 12 మరియు 13 తేదీల్లో విచారణ
- ఇరువైపుల వాదనలు విననున్న స్పీకర్
- ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విచారణ



హైదరాబాద్, నవంబర్ 04 బీఆర్ఎస్ దాఖలు చేసిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ నెల 6వ తేదీ నుంచి రెండో దశ విచారణను నిర్వహించనున్నారు. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ కింద నవంబర్ 6, 7, 12 మరియు 13 తేదీల్లో విచారణ చేపట్టనున్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ కోరుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్ (జగిత్యాల), పోచారం శ్రీనివాస్ రెడ్డి (బాన్సువాడ), తెల్లం వెంకట్రావు తరువాయి 2లో



2లో

## లండన్‌లో చంద్రబాబుతో భారత హైకమిషనర్ భేటీ

- లండన్ పర్యటనలో ఉన్న చంద్రబాబు
- ఏపీ సీఎంను కలిసిన దురైస్వామి
- ఏపీ, యూకే యూనివర్శిటీల మధ్య భాగస్వామ్యంపై చర్చ

## చేవెళ్ల బస్సు ప్రమాదం

### సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్



2లో

- డిసెంబర్ 15వ తేదీ లోపు నివేదిక సమర్పించాలని ఆదేశం
- రవాణా శాఖ, హోంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు
- నివేదిక పంపాలని కలెక్టర్, ఆర్టీసీ ఎండీలకు కూడా ఆదేశం




2లో

## జూబ్లీ 'హిల్స్' అధిరోహించాల్సిందే!

- తీవ్రంగా శ్రమిస్తున్న మూడు పార్టీలు
- భారీ జనసమీకరణతో కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి రోడ్‌షోలు
- ఇంటింటి ప్రచారంలో భాజపా



2లో

## కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్ట్ చేయలేదేం..?

- 'కాళేశ్వరం' కేసును మీరు కోరినట్టే సీబీఐకి అప్పగించాం
- ఇంకా కేసే నమోదు చేయలేదు
- కేసీఆర్‌కు లొంగకపోవడం నిజమైతే.. 11లోపు ఎఫ్ఐఆర్ నమోదు చేయండి.. కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి సవాల్
- ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్ అరెస్ట్‌కు గవర్నర్ అనుమతి కోరి 2 నెలలైనా స్పందన లేదని వెల్లడి

## మరింత దిగొచ్చిన బంగారం ధరలు



2లో

- మంగళవారం భారీగా పతనమైన బంగారం ఫ్యూచర్స్ ధరలు
- ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణ, బలపడిన డాలర్ ప్రధాన కారణాలు
- MCXలో రూ.836 తగ్గి రూ.1,20,573కు చేరిన పసిడి

## మంత్రి అజారుద్దీన్ కు రెండు కీలక శాఖల కేటాయింపు

- తెలంగాణ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అజారుద్దీన్
- ఆయనకు శాఖలను కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డి
- మైనార్టీ సంక్షేమ శాఖ బాధ్యతల అప్పగింత
- అదేవిధంగా పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ కేటాయింపు



2లో

# నవంబర్ 6 నుంచి ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లను విచారించనున్న స్పీకర్

హైదరాబాద్, నవంబర్ 04 : బీఆర్ఎస్ దాఖలు చేసిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ నెల 6వ తేదీ నుంచి రెండో దశ విచారణను నిర్వహించనున్నారు. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ కింద నవంబర్ 6, 7, 12 మరియు 13 తేదీల్లో విచారణ చేపట్టనున్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ కోరుతోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్ కుమార్ (జగిత్యాల), పోచారం శ్రీనివాస్ రెడ్డి (బాన్సువాడ), తెల్లం వెంకట్రావు (భద్రాచలం), అరెకపూడి గాంధీ (శేరిలింగంపల్లి)లను అనర్హులుగా ప్రకటించాలన్న పిటిషన్లపై విచారణ జరగనుంది. స్పీకర్ ఇరువైపుల వాదనలు వింటారు. తొలుత పిటిషనర్లు, ఆ తర్వాత ప్రతివాదులను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారు. రోజుకు ఇద్దరు చొప్పున విచారణ జరగనుంది. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కెమెరాల సమక్షంలో విచారణ కొనసాగుతుంది. మొదటి దఫా విచారణ సెప్టెంబర్ 29, అక్టోబర్ 1, అక్టోబర్ 24 తేదీల్లో జరిగింది. ప్రకాశ గౌడ్, కాలె యాదయ్య, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డిలను విచారించారు. తెలంగాణ అసెంబ్లీ చరిత్రలో అనర్హత పిటిషన్లను విచారించడం ఇదే మొదటిసారి.




## చేవెళ్ల బస్సు ప్రమాదం..
### సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్

హైదరాబాద్, నవంబర్ 04 : రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం స్పందించింది. చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు వద్ద కంకర లోడుతో వస్తున్న టిప్పర్... బస్సును ఢీకొనడంతో 19 మంది దుర్మరణం చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, డిసెంబర్ 15వ తేదీలోపు సమగ్ర నివేదికను అందజేయాలని ఆదేశించింది. ఈ మేరకు రవాణా శాఖ, హోంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీలను సైతం నివేదిక పంపాలని ఆదేశించింది. ప్రమాద సమయంలో ట్రక్కులోని కంకర బస్సులోని ప్రయాణికులపై పడటంతో ఊపిరాడక వారు మృతి చెందారు.

## యువతకు గుడ్‌న్యూస్.. తెలంగాణలో ఈ నెల
# ఈ నెల 10 నుంచి 'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ ర్యాలీ

హైదరాబాద్, నవంబర్ 04 : తెలంగాణ యువతకు ఇండియన్ ఆర్మీ గుడ్‌న్యూస్ చెప్పింది. భారత సైన్యంలో చేరేందుకు తెలంగాణలో 'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ అగ్నివీర్ల నియామక ర్యాలీ ఈ నెల 10 నుంచి 22 వరకు హన్మకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరగనుందని ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు తెలిపింది. చెన్నై జోన్ రిక్రూటింగ్ ఆఫీస్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ సమన్వయం, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఈ ర్యాలీ చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల అభ్యర్థులు ఈ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొనే అవకాశం కల్పించారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్స్‌మెన్ తదితర పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. దీనికి పదో తరగతి అర్హత ఉండాలని సూచించారు. అభ్యర్థులు తమకు జారీ చేసిన అడ్మిట్ కార్డుతో పాటు అవసరమైన అన్ని డాక్యుమెంట్లను తీసుకురావాలని బోర్డు సూచించింది. సంబంధిత నోటిఫికేషన్ ఇప్పటికే మార్చి 12 విడుదలై www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్లు బోర్డు తెలిపింది. నియామక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని బోర్డు అధికారులు తెలిపారు. నియామక సంబంధిత వివరాల కోసం అభ్యర్థులు సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయాన్ని టెలిఫోన్ నంబర్లు 04027740059, 27740205లకు సంప్రదించవచ్చని సూచించారు.

## మరింత దిగొచ్చిన బంగారం ధరలు



హైదరాబాద్, నవంబర్ 04 : బంగారం ధరలు మంగళవారం భారీగా తగ్గుముఖం పట్టాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం, అంతర్జాతీయంగా అమెరికా డాలర్ బలపడటం వంటి పరిణామాలు పసిడి ధరలపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో పాటు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు బలహీనపడటం కూడా బంగారం పతనానికి దారితీసింది. ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ (IBJA) వెల్లడించిన వివరాల ప్రకారం, మధ్యాహ్నం 12:30 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,19,916గా నమోదైంది. మరోవైపు, మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (MCX)లో డిసెంబర్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.836 (0.69 శాతం) తగ్గి 10 గ్రాములకు రూ.1,20,573 వద్ద ట్రేడ్ అయింది. ఇదే సమయంలో డాలర్ ఇండెక్స్ 0.08 శాతం పెరిగి 99.95 వద్ద స్థిరంగా కొనసాగింది. బలమైన డాలర్, అమెరికా చైనా మధ్య తగ్గుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు, అమెరికాలో వడ్డీ రేట్ల కోతకు అవకాశాలు తగ్గడం వంటి అంశాలు బంగారం ఆకర్షణను దెబ్బతీశాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనలిస్ట్ మానవ్ మోదీ మాట్లాడుతూ, "డాలర్ మూడు నెలల గరిష్ఠ స్థాయికి చేరడంతో బంగారం ధర ఔన్సుకు 4,000 డాలర్ల వద్ద కదలాడుతోంది. అమెరికా ఫెడరల్ ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా కీలక ఆర్థిక గణాంకాలు అందుబాటులో లేకపోవడంతో, డిసెంబర్ పాలసీ సమావేశం ముందు ఫెడ్ అధికారుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి" అని వివరించారు. మరోవైపు, ప్రపంచంలోనే అతిపెద్ద బంగారం వినియోగదారు అయిన చైనా, కొన్ని గోల్డ్ రిటైలర్లకు చాలాకాలంగా ఇస్తున్న పన్ను మినహాయింపు విధానాన్ని రద్దు చేసింది. ఇది అక్కడి బంగారం కొనుగోళ్ల జోరుకు కళ్లెం వేసే అవకాశం ఉంది. అయితే, వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (WGC) తాజా నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు 2025 మూడో త్రైమాసికంలో బంగారం కొనుగోళ్లను త్రైమాసిక ప్రాతిపదికన 28 శాతం పెంచాయి. "నవంబర్ ఆరంభంలో బలహీనపడిన రూపాయి, కామెక్స్‌లో బంగారం 4,010 డాలర్ల పైన ఉండటం వంటివి పసిడికి మద్దతునిచ్చాయి. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా కీలక డేటా విడుదల కానందున, ఇన్వెస్టర్లు ఈ వారం వెలువడనున్న మాన్యుఫ్యాక్చరింగ్, నాన్ మాన్యుఫ్యాక్చరింగ్ పీఎంఐ గణాంకాల కోసం ఎదురుచూస్తున్నారు" అని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది తెలిపారు. అమెరికా చైనా, అమెరికా భారత్ వాణిజ్య చర్చల్లో చోటుచేసుకునే పరిణామాలు బంగారం ధరల్లో తీవ్ర ఒడుదొడుకులకు కారణమవుతాయని, ధరలు రూ.1,18,000 నుంచి రూ.1,24,000 మధ్య కదలాడవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్, నవంబర్ 04 : అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. తెలంగాణలో ఏడబ్ల్యూఎస్ ఆన్ గోయింగ్ సెంటర్లు, వాటి విస్తరణపై చర్చించింది. ఈ సమావేశానికి ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్, ఇన్‌ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.

*** ముఖ్యమంత్రితో జర్మనీ కాన్సుల్**

**జనరల్ బృందం భేటీ**

జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ బృందం కూడా ముఖ్యమంత్రితో సమావేశమైంది. హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రికి తెలిపింది. డ్యూయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో జీసీసీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. దీని ద్వారా రానున్న రెండేళ్లలో సుమారు వెయ్యి మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని వెల్లడించింది. పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడానికి జర్మనీ సహకారం అవసరమని అన్నారు. తెలంగాణ విద్యార్థులకు జర్మన్ భాష బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని ముఖ్యమంత్రి కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ, జర్మనీ భాగస్వామ్యం మరింత బలపడాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్స్ రంగాల్లో జర్మనీ కంపెనీలను పెట్టుబడులు పెట్టమని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

## లండన్‌లో చంద్రబాబుతో భారత హైకమిషనర్ భేటీ

అమరావతి, నవంబర్ 04 : లండన్ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో యూకేలో భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామి సమావేశమయ్యారు. ఈ భేటీలో ఏపీ, యూకేల మధ్య విద్యా సంబంధాలను బలోపేతం చేయడంపై వీరు ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పించే దిశగా ఈ సమావేశం జరిగినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఏపీతో యూకేలోని పలు ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు కలిసి పనిచేసే విషయంపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ముఖ్యంగా నాలుగు కీలక అంశాల్లో భాగస్వామ్యం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై వీరి మధ్య సంభాషణ జరిగింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జాయింట్ వెంచర్లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యా రంగంలో కొత్త అవకాశాలు సృష్టించడంపై దృష్టి సారించారు. అలాగే, ఏపీ, యూకే వర్సిటీల మధ్య విద్యార్థుల మార్పిడి (స్టూడెంట్ ఎక్స్ఛేంజ్) కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారా ఇరు ప్రాంతాల విద్యార్థులు విజ్ఞానాన్ని, సాంస్కృతిక అంశాలను పరస్పరం పంచుకునేలా చూడాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాల ద్వారా ఏపీ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్య, పరిశోధన అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ భేటీ ఏపీ, యూకే మధ్య విద్యా సంబంధాల్లో ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

## మంత్రి అజారుద్దీన్ కు రెండు కీలక శాఖల కేటాయింపు

హైదరాబాద్, నవంబర్ 04 : ఇటీవల తెలంగాణ మంత్రిగా నియమితులైన భారత మాజీ క్రికెట్ కెప్టెన్ అజారుద్దీన్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో శాఖలను కేటాయించారు. ఆయనకు మైనార్టీ సంక్షేమ శాఖతో పాటు పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ బాధ్యతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. క్రికెటర్‌గా దేశవ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించిన అజారుద్దీన్, రాజకీయాల్లోకి ప్రవేశించి గతంలో ఎంపీగా కూడా పనిచేశారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర మంత్రిగా కొత్త బాధ్యతలను స్వీకరించబోతున్నారు. ఆయనకు మైనార్టీ సంక్షేమ శాఖను కేటాయించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖను కూడా ఆయన పర్యవేక్షించనున్నారు.

# జూబ్లీ 'హిల్స్' అధిరోహించాల్సిందే!

ఢిల్లీ, నవంబర్ 04 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయానికి కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి, భాజపాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. పోలింగ్ దగ్గర పడుతున్న కొద్దీ వ్యూహాలకు మరింత పదును పెడుతున్నాయి. ఈ ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారడంతో నిత్యం సర్వేలు చేస్తూ, కిందిస్థాయి నాయకుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నాయి. ఎక్కడెక్కడ దృష్టి కేంద్రీకరించాల్సి ఉందో గుర్తించి దానికనుగుణంగా చర్యలు తీసుకొంటున్నాయి. ఇంటింటి ప్రచారం, భారీ రోడ్‌షోలు, కమ్యూనిటీల పరంగా కార్యకలాపాల నిర్వహణతోపాటు స్థానికంగా అంతో ఇంతో పట్టున్న వారిని తమవైపు తిప్పుకొనేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ మేరకు మూడు ప్రధాన పార్టీల ముఖ్యనేతలంతా జూబ్లీహిల్స్ ఉపఎన్నికపైనే దృష్టి కేంద్రీకరించారు. పార్టీల ముమ్మర ప్రచారంతో త్రిముఖ పోటీ వాతావరణం నెలకొన్నా... పోలింగ్ సమీపించే కొద్దీ సమీకరణాలు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**అన్నీ తానైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

ఈ ఉప ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్న కాంగ్రెస్ సర్వశక్తులు ఒడ్డుతోంది. అసెంబ్లీ ఎన్నికలు గ్రేటర్‌లో కాంగ్రెస్‌ను నిరాశపర్చాయి. తర్వాత కంటోన్మెంట్ స్థానానికి వచ్చిన ఉప ఎన్నికలో ఆ పార్టీ గెలిచింది. ప్రస్తుతం జూబ్లీహిల్స్‌లోనూ పాగా వేయాలని ప్రయత్నిస్తోంది. అయితే పోటీ గట్టిగా ఉండటంతో వచ్చే నాలుగైదు రోజులు మరింత ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలన్న నిర్ణయానికి వచ్చింది. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ఇంట్లో మంత్రులందరితో సమావేశమయ్యారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ కూడా పాల్గొన్నారు. సుమారు మూడు గంటలకుపైగా పలు సర్వేలపై, మంత్రులు, ఎమ్మెల్యేలు పనిచేస్తున్న తీరుపై, ప్రత్యర్థి పార్టీల బలాలు, బలహీనతలపై చర్చించినట్లు తెలిసింది. పరిస్థితి సానుకూలంగా ఉందని, ఏ చిన్న అవకాశాన్నీ వదులుకోకూడదని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా పని చేయాలని, ఈ ఎన్నిక తమపై ఎలాంటి ప్రభావం చూపదనే అభిప్రాయంతో కొందరు ఎమ్మెల్యేలు నామమాత్రంగా ప్రచారంలో ఉంటున్నారని, ఆయా డివిజన్లలో బాధ్యతలు తీసుకొన్న మంత్రులు.. ఎమ్మెల్యేలతో మాట్లాడి చురుగ్గా పాల్గొనేలా చూడాలని సీఎం సూచించినట్లు తెలిసింది. ఆదివారం మంత్రులతో సుదీర్ఘంగా చర్చించిన సీఎం మళ్లీ మంగళవారం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సహా మరికొందరితో ప్రత్యేకంగా భేటీ అయినట్లు సమాచారం. డివిజన్ల వారీగా పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని బోరబండ డివిజన్ బాధ్యతలను అదనంగా పొంగులేటికి అప్పగించినట్లు తెలిసింది. మరో డివిజన్‌పైనా దృష్టి పెట్టాల్సి ఉందని, ఇప్పటికే బాధ్యతలు చూస్తున్నవారే ఎక్కువగా చూసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. మంత్రులతోపాటు ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ కూడా ఒక డివిజన్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు తీసుకొని పనిచేస్తున్నారు.

**అన్ని డివిజన్లపై కేటీఆర్ గురి**

భారత రాష్ట్ర సమితి కూడా పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించింది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ భారీ జనసమీకరణతో రోడ్‌షోలు నిర్వహించడంతోపాటు డివిజన్ల వారీగా ప్రచారాన్ని పర్యవేక్షిస్తున్నారు.



## కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్ట్ చేయలేదేం?

హైదరాబాద్: నవంబర్ 04: "భాజపా, భారత రాష్ట్రసమితిల మధ్య చీకటి ఒప్పందం ఉంది. పగలు తిట్టుకుంటారు.. రాత్రి కలుసుకుంటారు" అని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా మంగళవారం రహ్మత్‌నగర్ డివిజన్‌లో నిర్వహించిన రోడ్‌షోలో సీఎం పాల్గొన్నారు. అనంతరం శ్రీ రాంనగర్‌పీజేఆర్‌కూడలిలో ఏర్పాటు చేసిన ప్రచారసభలో ప్రసంగించారు. "కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు కేసీఆర్‌కు ఏటీఎంగా మారిందని పలు సందర్భాల్లో ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా అన్నారు. సీబీఐకి అప్పగిస్తే... 24 గంటల్లో కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్ట్ చేస్తామని కిషన్‌రెడ్డి చెప్పారు. సెప్టెంబరు 1న అసెంబ్లీలో తీర్మానం చేసి సీబీఐకి పంపితే.. ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. కిషన్‌రెడ్డీ... భారత రాష్ట్ర సమితితో మీకు లాలూచీ లేకపోతే ఎందుకు అరెస్ట్ చేయలేదు? ఫార్ములా ఈ రేస్‌లో రూ.50 కోట్ల ప్రజాధనం దోచిన కేటీఆర్‌ను అరెస్ట్ చేసేందుకు రెండు నెలల క్రితం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను అనుమతి కోరితే ఇంతవరకూ ఇవ్వలేదు. కారు స్టీరింగ్ మోదీ చేతుల్లో ఉంది. జూబ్లీహిల్స్‌లో కారు గెలిస్తే.. దిల్లీకి వెళ్లి కమలంగా మారుతుంది. పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకున్నవారికి అవకాశమిస్తే మనం మోసపోయినట్టే" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడి రూ.లక్ష కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్న కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను భాజపా వెనకేసుకొస్తోందని ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు కిషన్‌రెడ్డి లొంగకపోవడం నిజమైతే.. కేసీఆర్, కేటీఆర్‌లపై ఈ నెల 11లోపు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సవాల్ విసిరారు. భాజపా నాయకులు పరోక్షంగా భారత రాష్ట్ర సమితికి మద్దతు ఇస్తున్నారని... డిపాజిట్ కూడా రాకుండా చేసుకుంటున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో 30 వేల మెజారిటీతో గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు.

# జిన్నింగ్ మిల్లులు యథావిధిగా కొనసాగించాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిన్నింగ్ మిల్లులు యథావిధిగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని జిన్నింగ్ మిల్లుల యాజమాన్య ప్రతినిధులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, సిసిఐ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 6వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ పిలుపునిచ్చిన బంద్ నేపథ్యంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిన్నింగ్ మిల్లులను బంద్ చేయరాదని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మిల్లులను యథాతథంగా కొనసాగించాలనే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో ఎల్1, ఎల్2, ఎల్3 రకాల సమస్యలు లేకపోవడంతో, బంద్ అవసరం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలోని రైతులు వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున, పత్తి కొనుగోలు, ప్రాసెసింగ్ ప్రక్రియలో అంతరాయం కలగకుండా అన్ని మిల్లులు నిరాటంకంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు పత్తి తేమ శాతం 12% మించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ అధికారులు తేమ శాతంపై రైతులకు అవగాహన కల్పించి, పత్తి నాణ్యతను కాపాడే విధంగా సూచనలు ఇవ్వాలని అన్నారు. మార్కెట్ యార్డులలో పత్తి ఆరబెట్టడానికి తగిన సౌకర్యాలు కల్పించి, పత్తి తడివేయకుండా అన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి రైతులు మద్దతు ధర పొందాలని కలెక్టర్ సూచించారు. రైతులు సమయానికి పత్తిని మార్కెట్ కు తీసుకురావడంతో పాటు, మిల్లులు నిరాటంకంగా కొనుగోలు చేయడం ద్వారా జిల్లా వ్యవసాయ ఉత్పత్తి వ్యవస్థ సజావుగా కొనసాగుతుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి, సిసిఐ బయ్యర్లు, జిల్లా మార్కెట్ కమిటీల కార్యదర్శులు, జిన్నింగ్ మిల్లుల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు వనమహోత్సవానికి ఏర్పాట్లు




ప్రజా స్ఫూర్తి ,భద్రాద్రి కొత్తగూడెం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీన మున్నూరుకాపు సంక్షేమ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండలం సెంట్రల్ పార్క్‌లో కార్తీక వనమహోత్సవాన్ని నిర్వహించేందుకు ఆహ్వాన కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం కార్యక్రమ నిర్వహణ ప్రాంగణాన్ని జేసీబీతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు కాసా హన్మంతరావు, కార్యదర్శి ఎల్.గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన నిర్వహించే వనసమారాధన కార్యక్రమానికి మున్నూరుకాపులందరూ కుటుంబ సభ్యులతో సహా హాజరుకావాలని కోరారు. ఉదయం 9 గంటలకు కార్తీక దీపోత్సవం, గోపూజ ఉంటుందని, 11 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్నం 1 గంటకు వనభోజనాలు, అనంతరం తిరిగి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడుతాయని వారు తెలిపారు. వనమహోత్సవం వల్ల మున్నూరుకాపు కులస్తులు పరస్పరం పరిచయాలు పెంచుకోవడానికి, ఉల్లాసంగా గడపడానికి దోహదపడుతుందన్నారు. అధిక సంఖ్యలో ఈ కార్తీక వనమహోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ట్రెజరర్ మహాలక్ష్మి నర్సింహారావు, నాగేశ్వరరావు, వల్లాల ప్రసాద్, ఏనుగుల వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లను తక్షణమే విస్తరించి పటిష్టంగా నిర్మించాలి




వికారాబాద్ , ప్రజాస్ఫూర్తి : రోడ్లను తక్షణమే విస్తరించి, పటిష్టంగా నిర్మించాలని తాండూర్ ప్రజలు, విద్యార్థులు, రాజకీయ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్ల సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తాండూర్, వికారాబాద్ ప్రాంతానికి చెందిన 19 మంది దుర్మరణం చెందిన ఘటనపై తాండూర్ ప్రజలు, విద్యార్థులు, రాజకీయ నాయకులు ఒక్కటై ఇవాళ ఉదయం నుండి విలియమ్ మూన్ చౌరస్తాలో ధర్నాకు దిగారు.ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొన్న దుర్ఘటనకు తాండూర్ హైదరాబాద్ రోడ్ల అధ్వాన్న పరిస్థితి, కంకర టిప్పర్ల అతివేగం ప్రధాన కారణమని ఆందోళనకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ రావాలి రోడ్లు బాగు చేయాలి అంటూ నినాదాలు చేశారు.తాండూర్ హైదరాబాద్, తాండూర్ వికారాబాద్ రోడ్లను యుద్ధప్రాతిపదికన బాగు చేయాలని డిమాండ్ చేశారు.ఏళ్లుగా రోడ్లు గుంతలమయమై, భారీ లోడ్‌తో వెళ్లే వాహనాల వలన ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.నిరసన కారణంగా చౌరస్తా వద్ద వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి, కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు నిరసనకారులతో మాట్లాడారు.వారి డిమాండ్లను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, రోడ్ల మరమ్మతులపై స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఉద్రిక్తత సద్దుమణిగింది.ప్రజలు ధర్నాను విరమించుకోవడంతో ట్రాఫిక్ పునరుద్ధరణ జరిగింది. చేవెళ్ల దుర్ఘటన నేపథ్యంలో రోడ్ల భద్రతపై ప్రజల్లో నెలకొన్న ఆగ్రహాన్ని ఈ నిరసన స్పష్టం చేసింది.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

**- బూరుగు కృష్ణారెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు బురుగు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని మంగళవారం రైతు సంఘం నాయకులు సందర్శించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆరుకాలం పండించిన పంట మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి నెలలు గడుస్తున్నా, మ్యాచర్ పేరుతో వడ్లను కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్నట్టు వర్షాల వల్ల ఆ వడ్లు సైతం వర్షానికి కొట్టుకొని వెళ్లి మొలకలుగా మారడంతో రైతులు ఆర్థికంగా చితకపోయి, అప్పులపాలు అవుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మ్యాచ్ రిపేరుతోటి అశ్రద్ధ చేయకుండా రైతులు పండించినటువంటి పంటను త్వరగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం రాష్ట్ర నాయకులు చీరక అలివేలు, జల్లెల పెంటయ్య, జక్కిడి రాంరెడ్డి, చీర్క సంజీవరెడ్డి, ఆకుల ధర్మయ్య, గోశిక కరుణాకర్, ఎండి రేష్మ, వెంకటేష్, సప్పిడి రాఘవరెడ్డి, జక్కిడి గోపాల్ రెడ్డి, సుర్కంటి రాంరెడ్డి, అలివేలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోలు పరిమితి

### 25 క్వింటాళ్లకు పెంచాలి : మంత్రి తుమ్మల ఆదేశాలు



వానాకాలం సీజన్‌లో మక్కల దిగుబడి ఎక్కువగా ఉండడంతో రైతులు, ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు మక్కల కొనుగోలు పరిమితిని ఎకరాకు 18.5 క్వింటాళ్ల నుండి 25 క్వింటాళ్లకు పెంచాలని మార్క్ ఫెడ్ ఎండీని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశించారు. సోమవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా మక్కల కొనుగోలు కోసం 125 సెంటర్లు ప్రారంభించినట్లు తెలిపారు. మిగిలిన కొనుగోలు సెంటర్లను కూడా వెంటనే ప్రారంభించి, కొనుగోలు పరిమితి పెంచాలని అన్నారు. ఇప్పటి వరకు 125 సెంటర్ల ద్వారా 23,131 మెట్రిక్ టన్నుల మక్కలను సేకరించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందకపోయినా, మార్కెట్లో రైతులకు మద్దతు ధర లభించకపోవడంతో, మక్క రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వమే మక్కలను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. రూ. 2500 కోట్ల ఖర్చుతో మక్కలను కొనేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. జిన్నింగ్ మిల్లర్ల సమస్యలపై సీసీఐ సీఎండీతో సంప్రదింపులు : జిన్నింగ్ మిల్లర్ల సమస్యలు, పత్తి కొనుగోళ్లలో ఎదురవుతున్న ఇబ్బందులపై సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తాతో ఫోన్ ద్వారా వివరించారు. సీసీఐ అవలంబిస్తున్న ఎల్1, ఎల్2, ఎల్3 అలాట్‌మెంట్ విధానంతో కొనుగోళ్లు కొన్ని జిన్నింగ్ మిల్లులో మాత్రమే జరుగుతున్నదని, అనేక జిన్నింగ్ మిల్లులు మూతపడే పరిస్థితి ఉందని, కపాస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి కొనుగోళ్లలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందుల కారణంగా రైతులు, మిల్లు దారులు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే ఈనెల 6న ప్రైవేట్, సీసీఐ పత్తి కొనుగోళ్లు నిరవధికంగా నిలిపివేయాలని నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కనీస మద్దతు ధరకే కొనుగోలు చేపట్టాలని సూచించారు. అందుకోసం సీసీఐ ఎల్1, ఎల్2, ఎల్3 అలాట్‌మెంట్ ఎత్తివేసి, అన్ని నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లులలో కొనుగోళ్లను రెండు రోజుల్లో ప్రారంభించాలని కోరారు. దీనికి సీసీఐ సీఎండీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోలు ప్రక్రియలు సవ్యంగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాష్ట్ర కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డికి సూచించారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా తేమశాతం 12 కు పైగా ఉంటుందని, దీనిని సీసీఐ వారు కొనకపోవడంతో, రైతులకు బహిరంగ మార్కెట్లో మంచి ధర రాకపోవడంతో నష్టపోతున్నారని మంత్రి అన్నారు. రైతులు సంవత్సరమంతా శ్రమించి పత్తి పండిస్తారు. కేవలం తేమ శాతం కారణంగా వారి పత్తి కొనకుండా వారిని ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. ఎకరాకు 7 క్వింటాళ్ల వరకు మాత్రమే కొనుగోలు పరిమితి నిబంధనను ఎత్తివేయడం అత్యవసరమని పేర్కొన్నారు. సీసీఐ కొత్త నిబంధనలు, జిన్నింగ్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి కేంద్ర మంత్రులు బండి సంజయ్ , కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.




## రైతులకు నష్టం చెకూర్చే విధంగా ఎవరైన వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదు

*** ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య**

ప్రజా స్ఫూర్తి, ఇల్లందు: రైతులకు నష్టం చెకూర్చే విధంగా ఎవరైన వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య అన్నారు. ఇల్లందు వ్యవసాయ మార్కెట్ నందు సహకార సంఘం అధ్వర్యంలో ఎర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆయన హజరై కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు లబ్ధి చెకుర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం క్వింటా ధర 2400 రూ" గా నిర్ణయించి కోనుగోలు చేస్తుందన్నారు. ఈ సంవత్సరం వాతావరణ పరిస్థితులు అనుకూలించనపోవడంతో రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇల్లందు పరిసర ప్రాంతాలలో కొంత మంది వారే సొంతంగా ధర నిర్ణయించి,కొనుగోలు చేస్తున్నట్లుగా వాట్సఫ్ ద్వారా నాకు సమాచారం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, డీఏ స్పీ భాను చంద్ర,మార్కెపేడ్ డీఏ మ్ సునిత,ఆత్మ కమిటి చైర్మెన్ బోడా మంగిలాల్,ఇల్లందు సొసైటి చైర్మెన్ మెట్ల క్రిష్ణ,మడలం మాజీ వైస్ ఎంపిపి మండల రాంమహేష్,మండల పార్టీ అధ్యక్షులు పులి సైదులు వ్యవసాయ శాఖ ఏ డి ఏ లాల్ చంద్,ఏ ఓ సతీష్,మార్కెట్ కమిటి సెక్రెటరి సుచిత్ర,మానిటరింగ్ ఆఫీసర్ రాజేష్,నాయకులు పూనెం సురేందర్,కాకటి భార్గవ్,తాటి భిక్షం,మూతి క్రిష్ణ,అరెం కిరణ్,పాయం క్రిష్ణ ప్రసాద్,సోసైటి డైరెక్టర్లు కిన్నెర నర్సయ్య,బండారి శ్రీను,రావుల రమేష్,ఇర్ప మల్లమ్మ,కునుసోత్ రాము,గుంటి వెంకటేశ్వర్లు,మాజీ సర్పంచులు కల్తీ పద్మ,పాయం లలిత,ధనసరి స్రవంతి రాజు,చీమల వెంకటేశ్వర్లు,మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు మోకాళ్ళ వెంకటమ్మ,మండల పార్టీ మూత్ అధ్యక్షులు పూనెం మధు,టౌన్ నాయకులు మడుగు సాంబమూర్తి,బోళ్ళ సూర్యం,చిల్లా శ్రీనివాస్,గందె సదానందం,చీమల బక్కయ్య,పడిగ సంపత్,వ్యవసాయ శాఖ సిబ్బంది,పరిసర ప్రాంత రైతులు తదితరులు పాల్గోన్నారు.

## హైదరాబాద్‌లో మరోసారి కాల్పుల కలకలం



హైదరాబాద్ లో మరోసారి కాల్పులు కలకలం రేపాయి. భూ వివాదం విషయంలో రాయదుర్గంలో రెండు వర్గాల మధ్య మంగళవారం మధ్యాహ్నం భారీ ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో కర్నూలుకు చెందిన కృష్ణ అనే వ్యక్తి గన్‌తో గాలిలోకి కాల్పులు జరిపారు. దీంతో చేసేదేంలేక మరోవర్గం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన రాయదుర్గం పోలీసులు కాల్పులు జరిపిన కృష్ణను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఘర్షణకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వెలుస్తున్న కొత్త కొత్త కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ "సన్మాన్ ట్రినిటీ విల్లాస్" సంక్షేమ సంఘం సభ్యులు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలోని భూగర్భ డ్రైనేజ్, రోడ్డు సమస్యలపై విన్నవించగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. రానున్న రోజుల్లో సన్మాన్ ట్రినిటీ విల్లాస్ లో మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ నవీన్ ఎనుముల, ప్రధాన కార్యదర్శి పట్నాయక్, కోశాధికారి ఎం.నితిన్, ఉపాధ్యక్షులు వీరేంద్ర, సభ్యులు సంతోష్, అరుణ్ రెడ్డి, డాక్టర్ ప్రసాద్, రామిరెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ను పరామర్శించిన శంబీపూర్ కృష్ణ



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఇటీవల తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా కోకాపేట్ లోని క్రీన్స్ విల్లాస్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ పాల్గొని తన్నీరు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాజీ మంత్రి హరీష్ రావు ని పరమర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, కుంటి నాగరాజు, సుధాకర్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ జీతయ్య బీఆర్ఎస్ మునిసిపల్ జనరల్ సెక్రటరీ కొల్తూర్ మల్లేష్ ముదిరాజ్ , తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి హరీశ్ రావుకు పరామర్శ...



అందోలు, ప్రజాస్ఫూర్తి:సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణరావు ఇటీవల కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం అందోలు మండల పరిధిలోని తాలెల్మా గ్రామానికి చెందిన పలువురు బిఆర్ ఎస్ నాయకులు హరీశ్ రావును పరామర్శించి.. ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. హైదరాబాద్ కోకాపేటలో క్రిస్ విల్లాలోని ఆయన నివాసంలో హరీశ్ రావును కలిసి పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. భగవంతుడు వారి కుటుంబానికి ధైర్యాన్ని ఇవ్వాలని ఆశించారు. సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.బిఆర్ ఎస్ నాయకులు గడ్డమీది చందు, కరుణాకర్, ముస్తఫ్ఫా, రవి, యాదయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# గ్రంధాలయాల అభివృద్ధికి కృషి చేయండి...



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కేంద్ర గ్రంధాలయ అభివృద్ధితోపాటు జిల్లాలో ఉన్న పలు గ్రంధాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ గ్రంథాలయ చైర్మన్ వీరబాబు మంగళవారం కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ జిల్లా గ్రంధాలయంలో అనేక మౌళిక సదుపాయాల అవసరం ఉందని, అదే విధంగా జిల్లాలో ఉన్న పలు గ్రంధాలయాల అభివృద్ధికి స్థల సేకరణ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రంధాలయాలను అభివృద్ధిపర్చడం ద్వారా అనేక మంది పోటీ పరీక్షలకు సిద్ధవడే వారికి, పాఠకులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, గ్రంధాలయాల మౌలిక సదుపాయాల కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అఫీస్ ఇంచార్జ్ నవీన్ కుమార్ ఉన్నారు.

## వలిగొండ రోడ్డు తక్షణమే మరమ్మతులు చేపట్టి.. ప్రజల ప్రాణాలను కాపాడాలి

**- పల్లె మధుకృష్ణ**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి:చౌటుప్పల్ వలిగొండ రోడ్డు తక్షణమే మరమ్మతులు చేపట్టి.. ప్రజల ప్రాణాలను కాపాడాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పల్లె మధుకృష్ణ అన్నారు. గుంతలమైన రోడ్డును తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో పరిపాలన అధికారి శ్రీనివాస్ కు మంగళవారం మెమోరండం అందజేశారు. ఈ సందర్భంగా పల్లె మధు కృష్ణ మాట్లాడుతూ అకాల వర్షాలకు చౌటుప్పల్ నుంచి వలిగొండ ప్రధాన రహదారి గుంతల మయంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, ప్రజలు తీవ్ర అస్తవ్యస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని రోడ్డు మరమ్మత్తులు వెంటనే ప్రారంభించాలని పేర్కొన్నారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎండి ఖయ్యుమ్, గుడ్డేటి సుజిత్, డివైఎఫ్ఐ నాయకులు సుక్క శ్రీకాంత్, తొర్పునూరి మల్లేశం, గంట శంకర్ రెడ్డి, విఘ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉర్సు ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

**బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



జీడిమెట్ల , (ప్రజాస్ఫూర్తి) : ఉర్సు ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముస్లిం సోదరులకు సూచించారు. చింతల్ డివిజన్ హెచ్.ఎం.టి హజరత్ జిందాషా మదార్ దర్గా లో ఈ నెల 9 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఉర్సు షరీఫ్ ఉత్సవ వేడుకలకు సంబంధించిన గోడపత్రికను మంగళవారం కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్గాకు వచ్చే వారికి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించాలని కమిటీ సభ్యులకు సూచించారు.తన సహాయ సహకారాలు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షులు ఎండి.అబ్దుల్ ఖాదీర్,సభ్యులు ఎండి. రియాజ్,బాబుమియా,ఎండి.రషీద్,గౌస్ భాయ్, కాశిఫ్,చాంద్,షేక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## రూ.కోటి పరిహారం ఎప్పుడిస్తారు? సిగాచీ ప్రమాదంపై హైకోర్టు కామెంట్స్

తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర విషాదం నింపిన ప్రమాదం సిగాచీ పరిశ్రమలో ప్రమాద ఘటనలో ఆ కంపెనీ ఎండీకి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మృతుల, బాధితుల కుటుంబాలకు పరిహారం చెల్లింపులో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. గత జులై 1న పరిశ్రమలో భారీ పేలుడు సంభవించి మూడంతస్తుల భవనం పేకమేడలా కూలిపోయింది. ఈ ఘటనలో 54 మంది కార్మికులు చనిపోయారు. ఈ ప్రమాద ఘటనపై కలపాల బాబురావు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ఇవాళ హైకోర్టు విచారించింది. పిటిషనర్ తరఫున వసుధానాగరాజు వాదనలు వినిపించారు. ఈ ఘటనలో 54 మంది మృతి చెందారని ప్రమాదం జరిగి 4 నెలలు గడిచిన ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని పిటిషనర్ తరఫున లాయర్ వాదించారు. బాధిత కుటుంబాలకు రూ. కోటి పరిహారం అందిస్తామని హామీ ఇచ్చారని కానీ ఇప్పటి వరకు ఆ పరిహారం అందించలేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ఈ పరిశ్రమలో ఎన్నో ఉల్లంఘనలు జరిగినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు.

# జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్డులో స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ పనుల లో ట్రాఫిక్ ఆంక్షలు



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : జీడిమెట్ల పైప్‌లైన్ రోడ్డుపై జరుగుతున్న స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ పనుల కారణంగా ప్రజల భద్రత కోసం , ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు తాత్కాలిక ట్రాఫిక్ మళ్లింపులు ఆంక్షలు అమలు చేయబడుతున్నాయని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ నరసింహ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నుండి పనులు పూర్తయ్యే వరకు సుచిత్ర వైపు వెళ్ళే వాహనాలు గాజులరామారం, షాపూర్ నగర్, రంగభుజంగ నుండి సుచిత్ర వైపు వెళ్ళే వాహనాలు సాయి కంట జంక్షన్ వద్ద కుడివైపు మళ్లి అయోధ్య నగర్ కుత్బుల్లాపూర్ జంక్షన్ సుచిత్ర దిశగా ప్రయాణించాలన్నారు. కొంపల్లి వైపు వెళ్ళే వాహనాలు గాజులరామారం, షాపూర్ నగర్, రంగభుజంగ నుండి కొంపల్లి వైపు వెళ్ళే వాహనాలు సాయి కంట జంక్షన్ వద్ద ఎడమవైపు మళ్లి సుభాష్ నగర్ , దూలపల్లి ఇండస్ట్రియల్ ఏరియా దూలపల్లి గ్రామం కొంపల్లి వైపు వెళ్లాలన్నారు. ప్రజలు ప్రయాణంలో ఆలస్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రత్యామ్నాయ మార్గాలు ఉపయోగించి, ట్రాఫిక్ సిబ్బందికి సహకరించాలన్నారు. ఉదయం నుండి రాత్రి వరకు భారీ వాహనాల రాకపోకలు నిషేధించడం జరిగిందన్నారు.



## ఆటోల చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

**- రిమాండ్ కు తరలింపు...**

**- వివరాలు వెల్లడించిన సీఐ అనిల్ కుమార్**

అందోలు, ప్రజాస్ఫూర్తి : ఆటో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి సీఐ అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి మండలం పెద్దరెడ్డి గ్రామానికి చెందిన శ్రీకాంత్ జోగిపేటకు సమీపంలో గల ఓ వ్యవసాయ క్షేత్రంలో పని కుదుర్చుకొని జోగిపేటలో నివాసం ఉంటున్నాడు. సోమవారం తన ఆటో తీసుకొని స్థానికంగా అన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. ఆస్పత్రి ఆవరణలో ఆటోను పార్క్ చేసి ఆస్పత్రి లోపలికి వెళ్ళగా తిరిగి వచ్చేసరికి తన ఆటో కనిపించలేదు. వెంటనే శ్రీకాంత్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మంగళవారం అందోలు మండలం సంగుపేట ఓ ఆటోను వదిలేసినట్లుగా గుర్తించారు. దీంతో పోలీసులు సిసి పుటేజ్ ను పరిశీలించిగా అందోలు మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన డప్పు అశోక్, మాసానిపల్లి గ్రామానికి చెందిన బంటు విష్ణు అని ఇద్దరు వ్యక్తులు ఆటోను తీసుకువెళ్లినట్లు గుర్తించారు. వెంటనే నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు.పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన డప్పు అశోక్ నెల రోజుల క్రితం ఇదే తరహాలో ఆందోల్ గ్రామ శివారులో నిలిపి ఉన్న ఆటోను దొంగిలించినట్లుగా తెలిపారు.

## ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ప్రైవేట్ కళాశాలల వినతి

చౌటుప్పల్ , (ప్రజాస్ఫూర్తి) : చౌటుప్పల్ మీదుగా నల్లగొండకు బీసీ జేఏసీ ఓపెన్ టాక్ కార్యక్రమానికి వెళుతున్న తీన్మార్ మల్లన్నకు పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయాలని కోరుతూ చౌటుప్పల్ ప్రైవేటు ఇంటర్, డిగ్రీ కళాశాలల మేనేజ్మెంట్, లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంజియు ప్రైవేటు మేనేజ్మెంట్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ బత్తుల శంకర్, నలంద డిగ్రీ కళాశాల, మాతృశ్రీ డిగ్రీ కళాశాల, ప్రతిభ ఒకేషనల్, జేబీఎం ఒకేషనల్, బీ.పిడి, శ్రీ చైతన్య పారమెడికల్ కళాశాల మేనేజ్మెంట్, ప్రైవేటు అధ్యాపక బృందం సభ్యులు చిలువేరు శ్రీనివాస్, వాలుగొండ శ్రీనివాస్, జంగయ్య, చిలువేరు దుర్గయ్య, గుఱ్ఱం రవి కుమార్, కట్టెల లింగస్వామి, శేఖర్ రెడ్డి, పానుగుళ్ల మల్లేశం, సంకటి అంజయ్య, గంగాదేవి మహేష్, దేవరకొండ శ్రీను, బీసీ పొలిటికల్ జేఏసీ



చౌటుప్పల్ కన్వీనర్ గట్టు మొగలయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రపంచ వేగవంతమైన నగరాల్లో హైదరాబాద్ టాప్ 4, ఆక్స్ ఫర్డ్ ఎకానమిక్స్ సర్వేలో కీలక విషయాలు

| ర్యాంకు | సిటీ | గ్రోత్ శాతం (%) | జీడీపీ 2018 (బిలియన్ US$) | జీడీపీ 2035 (బిలియన్ US$) |
|---|---|---|---|---|
| 1 | సూరత్ | 9.2 | 28.5 | 126.8 |
| 2 | ఆగ్రా | 8.6 | 3.9 | 15.6 |
| 3 | బెంగళూరు | 8.5 | 70.8 | 283.3 |
| 4 | హైదరాబాద్ | 8.2 | 50.6 | 201.4 |
| 5 | నాగ్‌పూర్ | 8.4 | 12.3 | 48.6 |
| 6 | తిరుప్పూర్ | 8.3 | 4.3 | 17.0 |
| 7 | రాజ్‌కోట్ | 8.3 | 6.8 | 26.7 |
| 8 | తిరుచిరాపల్లి | 8.3 | 4.9 | 19.0 |
| 9 | చెన్నై | 8.2 | 36.0 | 136.8 |
| 10 | విజయవాడ | 8.2 | 5.6 | 21.3 |

ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. ఆక్స్ ఫర్డ్ ఎకానమిక్స్ సర్వే ప్రకారం ఈ ర్యాంకు దక్కింది. ఈ సర్వేలో పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయవాడ పదో స్థానంలో చోటు సాధించింది. అయితే, హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టడానికి అంతర్జాతీయ సంస్థలు వస్తున్న సంగతి తెలిసిందే. దీంతో పాటు 120 గ్లోబల్ కేపబులిటీ సెంటర్స్ (జీసీసీ) ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాదు పెట్టుబడులకు హైదరాబాద్ అనుకూలంగా ఉందని, ముందుకొచ్చే సంస్థలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం విదితమే.

**భారతదేశంలో పది నగరాలు..**

ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న పది నగరాలు భారతదేశంలో ఉన్నాయి. వీటిని జీడీపీ20182035 ఆధారంగా ర్యాంకులు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే హైదరాబాద్ జీడీపీ 2018లో 50.6బిలియన్ డాలర్లు ఉండగా 2035 లో జీడీపీ 201.4బిలియన్ డాలర్లు ఉండబోతుందని అంచనా వేశారు.

# విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

*** మల్లఖంబ్ రాష్ట్రస్థాయి ఛాంపియన్ షిప్ క్రీడలు ప్రారంభం**

*** సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు**

*** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ, 69వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ట్రినిటి పాఠశాల సౌజన్యంతో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్రస్థాయి మల్లఖంబ్ క్రీడల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మంగళవారం హాజరై, క్రీడలను ప్రారంభించారు. ఎమ్మెల్యేకు ట్రినిటీ విద్యాసంస్థల యాజమాన్యం, విద్యార్థిని, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ జెండా ఆవిష్కరించి రెండు రోజులపాటు జరిగే ఈ రాష్ట్రస్థాయి ఛాంపియన్షిప్ పోటీలను ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి ఆకట్టుకున్నారు.







సాంస్కృతిక నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ భావితరాల భవిష్యత్తు విద్యార్థులదేనన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి, క్రీడలకు దగ్గరవ్వాలని సూచించారు. విద్య, వైద్యం బాగున్నప్పుడే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వ బడుల అభివృద్ధికి తన వంతుగా ప్రభుత్వంతో మాట్లాడతానని, కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా రూ.1.50కోట్లతో కస్తూరిబా బాలికల పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. సమాజసేవలో ఉన్న గొప్ప వ్యక్తులు కూడా ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఈవో సత్యనారాయణ, ఆర్డీవో శేఖర్ రెడ్డి, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహా గౌడ్, బత్తుల విప్లవ కుమార్, ట్రినిటి విద్యాసంస్థల చైర్మన్ కేవీబీ కృష్ణారావు, ట్రినిటీ పాఠశాల ప్రిన్సిపల్ ఉజ్జిని మంజుల, కోచ్ లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థుల ఫీజులు కట్టలేని సర్కార్.. జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి చేస్తుందా?: కేటీఆర్



హైదరాబాద్: వైఎస్ఆర్ తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టేసిందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. విద్యా సంస్థలకు ఇవ్వాల్సిన రూ.10 వేల కోట్ల బకాయిలు చెల్లించలేదన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. రూ.10 వేల కోట్ల బాకీలు అడిగితే కాలేజీలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, కాలేజీలు మూయిస్తామంటూ బెదిరిస్తున్నారని ఆక్షేపించారు. "విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా లేకుండా పోయింది. విద్యార్థుల ఫీజులు కట్టలేని సర్కార్.. జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి చేస్తుందా? లక్షలాది మంది విద్యార్థుల ఫీజులు కట్టలేదు. పీఆర్‌సీ లేదు. ఉద్యోగుల బాధలను కూడా పట్టించుకోవడం లేదు. పింఛనర్లు రెండేళ్ల నుంచి బకాయిల కోసం ఎదురుచూస్తున్నారు. రేవంత్‌రెడ్డి నడుతున్నది సర్కారా.. బెదిరింపుల దర్బారా? కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారిని బెదిరించారు. తల్లిదండ్రులను సరిగా చూసుకోకపోతే జీతాల్లో 15 శాతం కోత పెడతా అంటున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించని రేవంత్ జీతంలో కూడా కోత పెట్టాలి కదా! ఒక్క ఛాన్స్ ఇవ్వండని మళ్లీ అడుగుతున్నారు. ఒక్క ఛాన్స్ ఇచ్చినందుకే రాష్ట్రం భ్రష్టుపట్టింది. దొంగ ఓట్లతో జూబ్లీహిల్స్‌లో గెలవాలని కాంగ్రెస్ చూస్తోంది. పదేళ్ల కేసీఆర్ పాలన బాగుందా..? రెండేళ్ల రేవంత్ పాలన బాగుందా? మళ్లీ కేసీఆర్ పరిపాలన రావాలంటే జూబ్లీహిల్స్ నుంచే జైత్రయాత్ర మొదలు కావాలి. కరెంటు లేని పరిస్థితి నుంచి సమృద్ధిగా కరెంట్ ఉండేలా చేశాం. పదేళ్లపాటు కంటికి రెప్పలా హైదరాబాద్‌ను కాపాడాం. అభివృద్ధి, సంక్షేమంలో మనతో పోటీపడే సత్తా రేవంత్‌రెడ్డికి లేదు. మహిళలు, రైతులు, నిరుద్యోగులను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. భారత రాష్ట్ర సమితిని గెలిపించండి.. కాంగ్రెస్ గల్లాపట్టి పథకాలు అమలు చేయిస్తాం" అని కేటీఆర్ అన్నారు.

## వృద్ధుడిని మెట్రో రైలు నుంచి తోసేసిన యువకులు అరెస్ట్




హైదరాబాద్: మెట్రో రైలు నుంచి వృద్ధుడిని తోసేసిన యువకులను సైఫాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వృద్ధుడు (62) గత నెల 21న అమీర్‌పేటలో మెట్రో రైలు ఎక్కాడు. సీనియర్ సిటిజన్ సీటులో కూర్చున్న యువకులను.. ఖాళీ చేయాలని కోరాడు. దీంతో ఆగ్రహానికి గురైన యువకులు.. అసభ్య పదజాలంతో వృద్ధుడిని దూషించి దాడికి దిగారు. లక్డీకాపూల్ మెట్రో స్టేషన్ రాగానే రైలు నుంచి తోసేశారు. గాయపడిన బాధితుడు.. ఘటనపై సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిజాంపేటకు చెందిన సివ్వాల సునీల్, అశోక్‌లతో పాటు ఏపీలోని పార్వతీపురానికి చెందిన రాజేష్‌లను అరెస్ట్ చేశారు. నిందితులపై 109(1), 126(2), 352రెడ్ విత్ 3(5) బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## బాధితులకు రూ.కోటి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారు? : తెలంగాణ హైకోర్టు



హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ కంపెనీ ఎండీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మృతులు, బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లింపులో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం రెండు వారాలకు వాయిదా వేసింది. సిగాచీ పరిశ్రమలో పేలుళ్ల ఘటనపై కలపాల బాబూరావు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున వసుధా నాగరాజు వాదనలు వినిపించారు. పేలుడు ఘటనలో 54 మంది మృతి చెందారని, ప్రమాదం జరిగి నాలుగు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. బాధితులకు ఇస్తామన్న రూ.కోటి పరిహారం కూడా ఇవ్వలేదని, ఎన్నో ఉల్లంఘనలు జరిగినట్టు దర్యాప్తులో తేలిందని వివరించారు. నిపుణుల కమిటీ నివేదికను విశ్లేషిస్తున్నామని అదనపు అడ్వొకేట్ జనర్ రజనీకాంత్ తెలిపారు. "192 మంది ప్రత్యక్ష సాక్షుల నుంచి పోలీసులు వాంగ్మూలం సేకరించారు. సిగాచీ కంపెనీకి చెందిన వైస్ ప్రెసిడెంట్ సైతం ప్రమాదంలో చనిపోయారు. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా పోలీసులు చర్యలు తీసుకోనున్నారు" అని కోర్టుకు తెలిపారు. బాధితులకు రూ.కోటి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు చెల్లించామని, కంపెనీ నుంచి మిగతా డబ్బులు వచ్చేలా చూస్తున్నామని ఏఏజీ వివరణ ఇచ్చారు. రెండు వారాల్లో సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఏఏజీని హైకోర్టు ఆదేశించింది.

## తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంపై అధ్యయనానికి కమిటీ ఏర్పాటు




హైదరాబాద్: తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంపై అధ్యయనానికి కమిటీ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. సంక్షేమశాఖ ప్రత్యేక సీఎస్ ఛైర్మన్‌గా, ప్రొఫెసర్ కోదండరాం, కంచ ఐలయ్య, ఆర్థిక, విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమశాఖల కార్యదర్శులు, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌తో పాటు ఉన్నత విద్యాసంస్థల నుంచి ముగ్గురు ప్రతినిధులను కమిటీలో సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. ఫీజు రీయింబర్స్ మెంట్ పాలసీపై కమిటీ.. ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనుంది. ప్రత్యేక ట్రస్ట్ ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధ్యాసాధ్యాలను కమిటీ పరిశీలించనుంది. 3 నెలల్లో కమిటీ నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. విద్యా సంస్థలు పేర్కొన్న సూచనలపై కూడా కమిటీ అధ్యయనం చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. గత నెల 28న ఇచ్చిన జీవోను ప్రభుత్వం తాజాగా బయటపెట్టింది.

## సుక్మా అడవుల్లో మావోయిస్టుల ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ స్వాధీనం



చర్ల: సుక్మా అడవుల్లో భద్రతా దళాలు చేపట్టిన ఓ ఆపరేషన్‌లో మావోయిస్టుల ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకున్నాయి. జిల్లాలోని గోంగూడ కంచాల అడవుల్లో డీఆర్ జీ(డిస్టిక్ రిజర్వ్ గార్డ్) బలగాలు మంగళవారం కూంబింగ్ చేస్తున్న క్రమంలో మావోయిస్టుల ఆయుధ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని గుర్తించాయి. భద్రతా బలగాలు ఆ ప్రాంతం నుంచి 17 రైఫిల్స్, రాకెట్ లాంచర్లు, ఆయుధాల తయారీ సామగ్రి, పరికరాలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఘటనను ఎస్పీ కిరణ్ చవాన్ ధ్రువీకరించారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చి చక్కటి జీవితాన్ని ప్రారంభించుకోవాలని ఎస్పీ సూచించారు. డీఆర్‌జీ వ్యూహాత్మక ఆపరేషన్‌ను ఆయన అభినందించారు.



## ఉన్నత విద్యామండలి కార్యాలయ ముట్టడికి యత్నం

హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో బీసీ విద్యార్థి సంఘం ఆందోళనకు దిగింది. ఉన్నత విద్యా మండలి కార్యాలయం ముట్టడికి యత్నించారు. కార్యాలయం వద్దకు పెద్దసంఖ్యలో చేరుకున్న విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో అక్కడ భారీగా పోలీసులు మోహరించారు.

## హైదరాబాద్‌లో వైద్యుడి ఇంట్లో రూ.3 లక్షల విలువైన డ్రగ్స్ పట్టివేత



హైదరాబాద్: నగరంలోని ఓ వైద్యుడి ఇంట్లో పోలీసులు డ్రగ్స్ పట్టుకున్నారు. ముషీరాబాద్‌లో అద్దెకు ఉంటున్న జాన్‌పాల్ అనే వైద్యుడి ఇంట్లో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అతడి నివాసంలో తనిఖీలు చేపట్టి.. రూ.3 లక్షల విలువ చేసే డ్రగ్స్‌ను ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. జాన్‌పాల్‌ను అరెస్టు చేసి ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రమోద్, సందీప్, శరత్.. ఢిల్లీ, బెంగళూరు నుంచి డ్రగ్స్ తెప్పించి వైద్యుడు జాన్‌పాల్ ఇంట్లో ఉంచి విక్రయిస్తున్నారు. డ్రగ్స్ విక్రయించినందుకు గాను వైద్యుడికి వీటిని ఉచితంగా ఇస్తున్నారు. అతడి ఇంట్లో ఓజీకుష్, ఎండీఎంఏ, కొకైన్, హాష్‌ఆయిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.



## తెలంగాణలోని పలు జిల్లాలకు వర్ష సూచన

హైదరాబాద్: అరేబియా సముద్రం నుంచి తెలంగాణ వైపు తేమ గాలులు వీస్తున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. దీంతో రాష్ట్రంలో సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తేమ గాలులు, అధిక ఉష్ణోగ్రతలతో ఇవాళ, రేపు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్‌తో పాటు నిర్మల్ జిల్లాల్లో ఇవాళ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నట్లు చెప్పారు.

## హోరాహోరీగా జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారం

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీల నుంచి ముగ్గురు స్టార్ క్యాంపెయినర్లు రంగంలోకి దిగి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తరపున సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి తరపున కేటీఆర్, బీజేపీ అభ్యర్థి తరపున కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారు. ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు చేసుకుంటున్నారు. పాదయాత్రల ద్వారా ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కాంగ్రెస్ నేతలు, ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ బీఆర్ఎస్ నేతలు, మాకు కూడా ఒక ఛాన్స్ ఇవ్వాలని బీజేపీ నేతలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. నవంబర్ 11న ఉప ఎన్నిక పోలింగ్ జరుగనుంది. నవంబర్ 14న ఓట్ల





లెక్కింపు చేపట్టనున్నారు. జూబ్లీహిల్స్ పరిధిలో మొత్తం 3,92,669 మంది ఓటర్లు ఉన్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు.

## హిందుజా చైర్మన్ గోపీచంద్ పి హిందుజా కన్నుమూత



**లండన్:** హిందుజా గ్రూప్ చైర్మన్ గోపీచంద్ పి హిందుజా కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయసు 85 ఏండ్లు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన లండన్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

హిందుజా బ్రదర్స్ మొత్తం నలుగురు. అందులో గోపీచంద్ పి హిందుజా రెండోవాడు. పెద్దవాడైన ఎస్పీ హిందుజా 2023 మేలో కన్నుమూసిన విషయం తెలిసిందే. గోపీచంద్ హిందుజా మృతికి ఆయన సోదరులు ప్రకాశ్ హిందుజా, అశోక్ హిందుజా సంతాపం వ్యక్తం చేశారు.

గోపీచంద్ హిందుజా 1950లో కుటుంబ వ్యాపారంలో అడుగుపెట్టారు. కంపెనీని ఇండో-మిడిల్ ఈస్ట్ ట్రేడింగ్ ఆపరేషన్ నుంచి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ఎంతో కృషి చేశారు. గోపీచంద్ పి హిందుజాకి బిజినెస్ సర్కిల్‌లో 'జీపీ'గా గుర్తింపు ఉంది. హిందుజా గ్రూప్ అనేక రంగాల్లో విస్తరించి ఉంది. ఆటోమోటివ్, బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ, హెల్త్‌కేర్, రియల్ ఎస్టేట్, పవర్, మీడియా, వినోదం వంటి 11 రంగాల్లో వ్యాపారాలను కలిగి ఉంది. అందులో అశోక్ లేలాండ్, ఇండస్ ఇండ్ బ్యాంక్ ప్రసిద్ధి చెందాయి.

## నష్టాల్లో ముగిసిన సూచీలు..

### సెన్సెక్స్ 519 పాయింట్లు డౌన్..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. టెలికాం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ మినహా అన్ని రంగాల్లో అమ్మకాలు కనిపించాయి. ప్రపంచ మార్కెట్‌లో మిశ్రమ సంకేతాల మధ్య సూచీలు లాభాల్లో ప్రారంభమయ్యాయి. లాభాలను నిలబెట్టుకోవడంలో విఫలమయ్యాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 84,000.64 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 84,068.01 పాయింట్ల గరిష్టానికి చేరిన సెన్సెక్స్.. 83,412.77 పాయింట్ల కనిష్టానికి చేరుకుంది. చివరకు 519.34 పాయింట్లు పతనమై.. 83,459.15 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 165.70 పాయింట్లు పడిపోయి 25,597.65 వద్ద ముగిసింది.

బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.2శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.7శాతం పడిపోయాయి. గురునానక్ జయంతి సందర్భంగా బుధవారం స్టాక్ మార్కెట్లు మూతపడనున్నాయి. నిఫ్టీలో అత్యధికంగా నష్టపోయిన వాటిలో పవర్ గ్రిడ్ కార్ప్, కోల్ ఇండియా, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, బజాజ్ ఆటో, ఎటర్నల్ ఉన్నాయి. టైటాన్ కంపెనీ, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఎంఅండ్ఎం లాభపడ్డాయి. కన్స్యూమర్ డ్యూరబుల్, టెలికాం మినహా మిగతా అన్ని రంగాల సూచీలు ఐటీ, ఆటో, ఎఫ్ఎంసీజీ, మెటల్, పవర్, రియాలిటీ, పీఎస్‌యూ సూచీలు 0.5శాతం నుంచి ఒకశాతం వరకు తగ్గాయి. క్యూ2 ఆదాయంతో భారతీ ఎయిర్‌టెల్ 52 వారాల గరిష్ట స్థాయికి చేరుకుంది. అలాగే, టైటాన్ కంపెనీ షేర్లు 2శాతం పెరిగాయి.

క్యూ2 ఫలితాలు బలహీనంగా ఉండడంతో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఇండియా షేర్ ధర దాదాపుగా 3శాతం తగ్గింది. గత నెలలో అమ్మకాలు పడిపోవడంతో హీరో మోటోకార్ప్ షేర్ ధర 4శాతం తగ్గింది. ఇజ్రాయెల్‌కు చెందిన టెక్నాలజీ సంస్థతో యూఎస్‌డీ 150 మిలియన్ల టెక్నాలజీ యాజమాన్య బదిలీ ఒప్పందంపై సంతకం చేయడంతో బ్లూ క్లౌడ్ షేర్లు 10శాతం పెరిగాయి. క్యూ2లో నష్టాలతో స్నోమాన్ లాజిస్టిక్స్ షేర్లు 5శాతం పడిపోయాయి. సిటీ యూనియన్ బ్యాంక్, ఎంఆర్‌పీఎల్, అసహి ఇండియా, ఢిల్లీవరీ, టైటాన్ కంపెనీ, భారతీ ఎయిర్‌టెల్, బీపీసీఎల్, ఓవోసీ, లారస్ ల్యాబ్స్, సీబీఐతో సహా 140 స్టాక్స్ బీఎస్ఈలో 52 వారాల గరిష్ట స్థాయికి చేరుకున్నాయి.

## 'డిజిటల్ అరెస్ట్' స్కాంలపై ఎన్పీసీఐ హెచ్చరిక

'డిజిటల్ అరెస్ట్' పేరుతో కొత్త తరహా మోసాలు

పోలీసులు, సీబీఐ అధికారులమంటూ బెదిరింపులు

వీడియో కాల్స్‌లో నకిలీ పోలీస్ స్టేషన్ సెటప్‌లు

డబ్బులు బదిలీ చేయాలంటూ బాధితులపై ఒత్తిడి

అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎన్పీసీఐ సూచన

సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయాలని వెల్లడి



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా కొత్త తరహా సైబర్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో, 'డిజిటల్ అరెస్ట్' పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మంగళవారం కీలక సూచనలు జారీ చేసింది. సైబర్ నేరగాళ్లు పోలీసు, సీబీఐ, కస్టమ్స్, ఆదాయ పన్ను శాఖ అధికారులమంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు దోచుకుంటున్నారని హెచ్చరించింది.

మోసం చేసే విధానం ఇదే...!

ఈ 'డిజిటల్ అరెస్ట్' మోసంలో నేరగాళ్లు మొదట సాధారణ ఫోన్ కాల్ చేసి, ఆ తర్వాత బాధితులను నమ్మించడానికి వీడియో కాల్స్‌కు మారతారు. తాము ప్రభుత్వ అధికారులమని చెప్పి, బాధితులపై లేదా వారి కుటుంబ సభ్యులపై మనీ లాండరింగ్, డ్రగ్స్ రవాణా లేదా పన్ను ఎగవేత వంటి తీవ్రమైన కేసులు నమోదయ్యాయని బెదిరిస్తారు.

తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అరెస్ట్ చేస్తామని హెచ్చరిస్తూ బాధితుల్లో భయాన్ని సృష్టిస్తారు. వీడియో కాల్స్ సమయంలో నకిలీ యూనిఫాంలు, ప్రభుత్వ లోగోలు, పోలీస్ స్టేషన్ వంటి నకిలీ నేపథ్యాలను సృష్టించి బాధితులను పూర్తిగా నమ్మిస్తారు. అంతటితో ఆగకుండా, తాము చెప్పేది నిజమేనని భ్రమింపజేసేందుకు వెనుక వైపు అధికారిక కార్యాలయాల్లో వినిపించే శబ్దాలు వచ్చేలా చూసుకుంటారు.

కేసు విచారణ పూర్తయ్యే వరకు కొంత మొత్తాన్ని తమ ఖాతాకు బదిలీ చేయాలని బాధితులపై ఒత్తిడి తెస్తారు. "మీ పేరును కేసు నుంచి తొలగించడానికి", "విచారణకు సహకరించడానికి" లేదా "రిఫండబుల్ సెక్యూరిటీ డిపాజిట్" వంటి మాటలు చెప్పి మోసపూరితంగా డబ్బులు బదిలీ చేయించుకుంటారు.

# రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌కు భారత జట్టును ప్రకటించిన బీసీసీఐ..





కెప్టెన్‌గా జితేష్ శర్మ..!

**న్యూఢిల్లీ:** త్వరలో ప్రారంభం కానున్న రైజింగ్ స్టార్స్ ఆసియా కప్-2025 కోసం ఇండియా ఏ జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. జితేశ్ శర్మ కెప్టెన్‌గా నియమించగా.. యువ సంచలనం వైభవ్ సూర్యవంశి, ఐపీఎల్ స్టార్ ప్రియాంష్ ఆర్యలకు జట్టులో చోటు కల్పించింది. ఈ టోర్నీ నవంబర్ 14 నుంచి 23 వరకు ఖతార్‌లోని దోహాలో జరుగనున్నది. భారత జట్టు గ్రూప్-బీ ఉంది. ఇందులో ఒమన్, యూఏఈ, పాక్ జట్లు.. ఇక గ్రూప్ ఏలో బంగ్లాదేశ్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, హాంకాంగ్ జట్లు ఉన్నాయి. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో భారత జట్టుతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతున్న జితేష్ శర్మ ఆసియా కప్‌లో ఇండియా-ఏ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఈ ఏడాది ఐపీఎల్ టైటిల్‌ను నెగ్గిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టులో సభ్యుడు. ఇటీవల జితేష్ ఆస్ట్రేలియాతో జరిగిన మూడవ టీ20లో అజేయంగా 22 పరుగులతో భారత్‌ను విజయపథంలో నడిపించాడు. అతని అనుభవం, నాయకత్వం యువ ఆటగాళ్లకు ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు. 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఈ టోర్నమెంట్‌లో అతి పిన్న వయస్కుడైన ఆటగాడిగా నిలిచాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున చారిత్రాత్మక 101 పరుగుల ఇన్నింగ్స్‌తో టీ20 క్రికెట్‌లో సెంచరీ చేసిన అతి పిన్న ఆటగాడిగా నిలిచాడు. ఇటీవల ఆస్ట్రేలియా-ఏతో జరిగిన అండర్-19 టెస్ట్‌లో కూడా సెంచరీ నమోదు చేశాడు. పంజాబ్ కింగ్స్ తరఫున అద్భుతంగా రాణించిన ప్రియాంష్ ఆర్య, సెప్టెంబర్‌లో ఇండియా-ఏ, ఆస్ట్రేలియా-ఏతో మధ్య జరిగిన అనధికారిక వన్డేలో కూడా సెంచరీ సాధించాడు. ఈ అద్భుతమైన ప్రదర్శనతో రైజింగ్ స్టార్స్ ఆసియా కప్‌లో చోటు దక్కింది. ఈ టోర్నమెంట్‌ను గతంలో ఇండియా ఎమర్జింగ్ కప్‌గా పిలుస్తుండేవారు. ఇది ప్రధానంగా అండర్-23 టోర్నమెంట్. దీన్ని ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్‌గా పిలుస్తారు. కానీ, ప్రస్తుతం భారత్ సహా అనేక దేశాలు ప్రతిభ, అనుభవ సమతుల్యతను కొనసాగించేందుకు యువ, సీనియర్ ఆటగాళ్లకు జట్టులో చోటు కల్పిస్తున్నాయి. ఈ టోరనీలో ఆరు ఎడిషన్స్ జరిగాయి. గత ఆరు ఎడిషన్స్‌లో భారత్ 2013లో తొలి ఎడిషన్‌లో ఒకసారి మాత్రమే టైటిల్‌ను గెలుచుకుంది. ఫైనల్‌లో భారత జట్టు పాకిస్తాన్‌ను ఓడించింది. 2017, 2018లో శ్రీలంక టైటిల్ గెలుచుకోగా.. పాకిస్థాన్ 2019, 2023లో టైటిల్‌ను సాధించాయి. 2024లో ఆఫ్ఘనిస్థాన్ టైటిల్ గెలుచుకుంది.

**భారత జట్టు :** జితేష్ శర్మ (కెప్టెన్-వికెట్ కీపర్), నమన్ ధీర్ (వైస్ కెప్టెన్), ప్రియాంష్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, నేహాల్ వధేరా, సూర్యాంశ్ షెడ్గే, రమణదీప్ సింగ్, హర్ష్ దూబే, యశ్ ఠాకూర్, గుర్జాప్‌నీత్ సింగ్, విజయ్ కుమార్ వైషాక్, యుధ్వీర్ సింగ్ చరక్, అభిషేక్ పోరెల్ (వికెట్ కీపర్), సుయాశ్ శర్మ, అశుతోష్ శర్మ.

**స్టాండ్ బై ప్లేయర్లు :** గుర్నూర్ సింగ్ బ్రార్, కుమార్ కుషాగ్రా, తనుష్ కోటియన్, సమీర్ రిజ్వీ, షేక్ రషీద్.

## పవర్ హిట్టర్ బెయిర్‌స్టోకు షాక్..
## యువకెరటాలకు సెంట్రల్ కాంట్రాక్ట్..!



**లండన్:** యాషెస్ సిరీస్ సమీపిస్తున్న వేళ ఆటగాళ్లలో ఉత్సాహం నింపింది ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు. జాతీయ జట్టు విజయాల్లో కీలకం అవుతున్న క్రికెటర్లకు బోర్డు మంగళవారం సెంట్రల్ కాంట్రాక్టులు ప్రకటించింది. సీనియర్లకు పెద్ద పీట వేసిన ఈసీబీ ఈ మధ్య అంతర్జాతీయంగా సత్తా చాటిన యువకెరటాలకు కూడా కాంట్రాక్ట్‌లో చోటు కల్పించింది. టెస్టు సారథి బెన్ స్టోక్స్‌తో పాటు మూడు ఫార్మాట్లలో కీలకమైన ఆటగాళ్లలో పలువురికి రెండేళ్ల క్రాంట్టాక్ లభించింది.

ఈ ఏడాది అక్టోబర్ నుంచి 2026 సెప్టెంబర్ వరకూ ఇంగ్లండ్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్‌లను ఇచ్చింది. షాకింగ్ న్యూస్ ఏంటంటే.. పవర్ హిట్టర్లు అయిన జానీ బెయిర్‌స్టో, లియాం లివింగ్‌స్టోన్‌లు మాత్రం ఈ జాబితాలో లేరు. నిరుడు భారత పర్యటనలో రానించిన స్పిన్నర్ జాక్ లీచ్, పేసర్ ఓలీ స్టోన్‌లకు కూడా కాంట్రాక్ట్‌లో చుక్కెదురైంది. పేసర్ మార్క్ వుడ్‌తో పాటు జూనియర్లకు ఏడాది కాలానికే కాంట్రాక్ట్ ఇస్తున్నట్టు ఈసీబీ వెల్లడించింది.

ఇటీవల 'ది హండ్రెడ్ లీగ్'లో మెరిసిన యువ పేసర్ సోనీ బేకర్‌కు ప్రోత్సాహకంగా తొలిసారి కాంట్రాక్ట్ ఇచ్చారు. స్పిన్ ఆల్‌రౌండర్ డాసన్, సాకిబ్ మహమూమద్, పొడగరి పేసర్ జేమీ ఓవర్టన్‌లకు కూడా మొదటిసారి ఈసీబీ నుంచి జీతం అందుకోనున్నారు.

**రెండేళ్ల కాంట్రాక్ట్:** బెన్ స్టోక్స్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, జోస్ బట్లర్, బ్రైడన్ కార్సే, సామ్ కరన్, బెన్ డకెట్ విల్ జాక్స్, ఆదిల్ రషీద్, జో రూట్, జేమీ స్మిత్, జోష్ టంగ్.

**ఏడాది కాంట్రాక్ట్:** రెహ్మాన్ అహ్మద్, సోనీ బేకర్, షోయబ్ బషీర్, జాక్ క్రాలే, లియాం డాసన్, సకీబ్ మహమూద్, జేమీ ఓవర్టన్, ఓలీ పోప్, మాథ్యూ పాట్స్, ఓలీ పోప్, ఫిల్ సాల్ట్, మార్క్ వుడ్, ల్యూక్ వుడ్.

**వీళ్లపై వేటు:** జానీ బెయిర్‌స్టో, జాక్ లీచ్, లివింగ్‌స్టోన్, రీసే టాప్లే, జాన్ టర్నర్.

**డెవలప్‌మెంట్ కాంట్రాక్ట్:** జోష్ హల్, ఎడ్డీ జాక్, టామ్ లావెస్, మిచెల్ స్టాన్లీ.

## భారీ శతకంతో విరుచుకుపడిన యశస్వీ..



**న్యూఢిల్లీ:** టెస్టు క్రికెట్‌లో సంచలనంగా పేరొందిన యశస్వీ జైస్వాల్ పరుగుల వరద పారించేందుకు సిద్ధమవుతున్నాడు. ఈమధ్యే వెస్టిండీస్‌పై శతక గర్జన చేసిన విధ్వంసక ప్లేయర్.. దక్షిణాఫ్రికా సిరీస్‌కు ముందే సెంచరీతో హెచ్చరికలు పంపాడు. సఫారీలతో మ్యాచ్ సన్నద్ధతగా దేశవాళీలో ఆడుతున్న యశస్వీ.. భారీ శతకంతో ఫామ్ చాటుకున్నాడు. రంజీ ట్రోఫీలో ముంబై ఓపెనర్‌గా బరిలోకి దిగిన ఈ కుర్రాడు రాజస్థాన్ బౌలర్లను ఊచకోత కోసి భారీ శతకం సాధించాడు.

చిన్న వయసులోనే సుదీర్ఘ ఫార్మాట్‌లో రికార్డులు నెలకొల్పుతున్న యశస్వీ జైస్వాల్ రంజీల్లోనూ తన బ్యాట్ పవర్ చూపించాడు. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో రాజస్థాన్ బౌలర్లకు దడపుట్టించాడీ లెఫ్ట్ హ్యాండర్. తొలి ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ(67)తోనే సరిపెట్టుకున్న రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కసిదీరా కొట్టాడు. మొదటి ఇన్నింగ్స్‌లో 254కే కుప్పకూలిన జట్టును ఓటమి నుంచి తప్పించేందుకు శతకం(156)తో వీరవిహారం చేశాడు యశస్వీ.

ప్రత్యర్థి బౌలర్లను ఉతికేస్తూ 18 బౌండరీలతో సూపర్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. ఈ పెద్ద ఇన్నింగ్స్‌తో దక్షిణాఫ్రికాతో జరుగుబోయే టెస్టు సిరీస్‌లో తాను సెంచరీలో మెరవడం ఖాయమని చాటాడీ చిచ్చరపిడుగు. అతడి ఫామ్ చూస్తుంటే సఫారీ బౌలర్లకు కూడా పట్టపగలే చుక్కలు కనిపించేలా ఉన్నాయి. యశస్వీ మెరుపు సెంచరీకి, ముషీర్ ఖాన్ అర్ధ శతకం తోడవ్వగా ముంబై, రాజస్థాన్ మ్యాచ్ డ్రాగా ముగిసింది.

### 14న ఈడెన్ గార్డెన్స్‌లో

మూడు ఫార్మాట్ల సిరీస్ కోసం దక్షిణాఫ్రికా నవంబర్ రెండో వారంలో భారత పర్యటనకు రానుంది. నవంబర్ 14న ఈడెన్ గార్డెన్స్‌లో తొలి టెస్టులో టీమిండియాతో సఫారీ టీమ్ తలపడనుంది. గువాహటిలో నవంబర్ 22 నుంచి రెండో టెస్టు షురూ కానుంది. అనంతరం నవంబర్ 30 నుంచి మూడు వన్డేల సిరీస్.. ఆపై డిసెంబర్ 9 నుంచి ఇరుజట్ల మధ్య ఐదు టీ20ల సిరీస్ మొదలవ్వనుంది.

# ప్రపంచకప్‌లో విజయం.. ముగ్గురు వుమెన్స్ క్రికెటర్లను సన్మానించనున్న మరాఠా సర్కారు..!







**న్యూఢిల్లీ:** ఐసీసీ వుమెన్స్ వన్డే ప్రపంచకప్ నెగ్గిన భారత జట్టులోని సభ్యులను ఘనంగా సత్కరించడంతో పాటు నజరానా ఇవ్వాలని మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వన్డే ప్రపంచకప్‌లో భారత్ చారిత్రాత్మక విజయం నమోదు చేసిన విషయం తెలిసిందే. హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత మహిళా జట్టు ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి టైటిల్ గెలిచింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అధ్యక్షతన మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మహారాష్ట్రకు చెందిన ముగ్గురు క్రికెటర్లను సత్కరించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సీఎం ఫడ్నవీస్‌తో పాటు డిప్యూటీ సీఎంలు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్ పాల్గొన్నారు. స్మృతి మంధాన, జెమిమా రోడ్రిగ్స్, రాధా యాదవ్‌లను ఘనంగా సత్కరించడంతో పాటు నజరానా ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. నజరానా ఎంత ఇవ్వనున్నారనే తెలియరాలేదు. టీమిండియా ప్రపంచకప్‌ను సాధించడంపై కేబినెట్ ప్రశంసలు కురిపించింది.

అయితే, ఎంత నగదు పారితోషకం ఇవ్వనుందో మాత్రం తెలియరాలేదు. ఇదిలా ఉండగా.. భారత వుమెన్స్ జట్టును ప్రధాని నరేంద్ర మోదీని కలిసేందుకు మంగళవారం ముంబయి నుంచి ఢిల్లీకి బయలుదేరింది. వుమెన్స్ జట్టును బుధవారం ప్రధాని సత్కరించనున్నారు. సోమవారం ఆలస్యంగా ప్రధాని కార్యాలయం నుంచి వుమెన్స్ జట్టుకు పిలుపు అందింది. గతంలో ప్రధాని మెన్స్ జట్టును అభినందించిన విషయం తెలిసిందే. యూఎస్-వెస్టిండిస్ వేదికగా జరిగిన టీ20 వరల్డ్ కప్‌లో రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత జట్టు విజయం సాధించగా.. ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన భారత జట్టు ఆ తర్వాత మెరైన్ డ్రైవ్ మార్గంలో విక్టరీ పరేడ్ నిర్వహించింది. ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టుకు బీసీసీఐ ఇప్పటికే భారీ నజరానా ప్రకటించింది. రూ.51కోట్ల ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు తెలిపింది.

MOVIE TIME

## పెద్దిలో మొహిత్ చౌహాన్ పాట

**టాకీస్:** రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది' సినిమా ప్రమోషన్స్ షురూ అయ్యాయి. సినిమాకు సంబంధించి ఏదో ఒక అప్‌డేట్ ఇస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. తాజాగా కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ క్యారెక్టర్ రివీల్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు. అలాగే ఫస్ట్ సింగిల్ టైటిల్ కూడా తెలిపారు. ఈ పాట 'చికిరి' అనే లైన్‌తో ఉంటుందని తెలిసింది. ఈ విషయాన్ని స్వయంగా ఎ.ఆర్.రెహమాన్ వెల్లడించారు. దర్శకుడు, సింగర్ మోహిత్ చౌహాన్‌తో కలిసి కీ బోర్డ్ ముందుకు కూర్చున్న ఫొటోను రామ్‌చరణ్ షేర్ చేసి ఏం వండుతున్నారు గయ్స్' అని ట్వీట్ చేశారు. దానికి 'చికిరి చికిరి.. చరణ్‌గారు' అంటూ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ రిప్లై



ఇచ్చారు. దర్శకుడు కూడా అదే సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఎక్స్‌లో వీరి సంభాషణ నెట్టింట వైరల్ మారింది. పాట కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు అభిమానులు పోస్టులు పెడుతున్నారు. అయితే ఈ పాట ప్రమోషనల్ వీడియోలో రెహమాన్ కూడా కనిపించబోతున్నారు. చికిరి పాటకి సింగర్ గా మోహిత్ చౌహాన్‌ను ఎంపిక చేశారాయన. హిందీలో ఆయన ఎన్నో హిట్ చిత్రాలకు పాటలు పాడారు. అక్కడ ఆయన ఎంతో పాపులర్. 'రాక్ స్టార్' సినిమాలో మొత్తం 15 పాట ఉంటే అందులో తొమ్మిది పాటలిన మోహిత్ ఛౌహాన్‌తోనే పాడించారు రెహమాన్. దాంతో ఆయన పేరు పాపురల్ అయింది. మోహిత్ తెలుగు సంగీత దర్శకులతో ఎక్కువ పని చేయలేదు కానీ తమిళ సినిమా పాటల్ని తెలుగులో పాడారు. ఆయన వాయిస్ కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. దర్శకుడు నాగ్ అశ్విన్‌కు ఆయనపై ప్రత్యేక అభిమానంతో 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాలో 'ఇదేరా' అంటూ సాగే పాటను పాడించారు. తర్వాత డైరెక్ట్ తెలుగు సినిమా పాడిన సందర్భం లేదు. ఇప్పుడు 'పెద్ది' సినిమాతో తెలుగులో మళ్లీ పాడుతున్నారు. అయితే పెక్యులర్ వాయిస్ చికిరి పాటకు కొత్తదనం తీసుకొస్తుందని టీమ్ బలంగా నమ్ముతోంది.




## థ్రిల్లర్ మూవీలో మీనాక్షి చౌదరి

టాకీస్: ప్రముఖ నటి మీనాక్షి చౌదరి కొత్త పాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదలైంది. నాగచైతన్య హీరోగా 'విరూపాక్ష' దర్శకుడు కార్తీక్ దండు ఓ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్. సోమవారమే ఈ సినిమాలో ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ ను విడుదల చేస్తామని నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ తెలిపారు. అయితే చేవెళ్ళ బసు దుర్ఘటనతో దానిని ఈ రోజుకు వాయిదా వేశారు. ఆ ప్రకారంగా మీనాక్షి చౌదరి ఫస్ట్ లుక్ పోస్టర్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇంకా పేరు పెట్టని ఈ మిథికల్ థ్రిల్లర్ మూవీలో దక్ష అనే ఆర్కియాలజీ సైంటిస్ట్ పాత్రను మీనాక్షి చౌదరి చేస్తోంది. తాజా విడుదలైన పోస్టర్ చూస్తుంటే... ఈ పాత్ర సినిమాలో చాలా కీలకమైందనేది అర్థమౌతోంది. దర్శకుడు సుకుమార్ సైతం నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాతో 'లాపతా లేడీస్' ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రముఖ కన్నడ సంగీత దర్శకుడు అజనీశ్ బి. లోకనాథ్ దీనికి సంగీతం అందిస్తున్నాడు.

## రాజాసాబ్ సంక్రాంతికి రావడం పక్కా

**టాకీస్:** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రాల్లో ది రాజాసాబ్ సంక్రాతికి పక్కా అని నిర్మాత తేల్చి చెప్పారు.. మారుతీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవిక మోహన్, నిధి అగర్వాల్, రిద్ది హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఎప్పుడెప్పుడు ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందా అని అభిమానులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. ఇక ప్రభాస్ సినిమా అంటే వాయిదా లేకుండా రిలీజ్ ఉండదు అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ది రాజాసాబ్ కూడా అదే తరహాలో వరుస వాయిదాలు పడుతూ వస్తుంది. డిసెంబర్ 5 న




అనుకున్న సినిమా మరోసారి వాయిదా పడి సంక్రాంతి బరిలో దిగింది. జనవరి 9 న ది రాజాసాబ్ రిలీజ్ కు సిద్దమవుతుంది. ఇక గతకొన్నిరోజులుగా సంక్రాంతి నుంచి కూడా రాజాసాబ్ తప్పుకుందని వార్తలు వస్తున్నాయి. తాజాగా రాజాసాబ్ వాయిదా రూమర్స్ ను నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఖండించాడు. కచ్చితంగా రాజుగారు సంక్రాంతికి వస్తున్నారని తెలిపారు. ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టనున్నట్లు.. డిసెంబర్ లో అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్ చేయనున్నట్లు చెప్పుకొచ్చారు. ఇలాంటి పుకార్లను నమ్మకుండా ఉండాలని అభిమానులను కోరాడు. ప్రసుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. మరి ఈ సినిమాతో ప్రభాస్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.

## 14న దుల్కర్ సల్మాన్..కాంత విడుదల

**టాకీస్:** మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న సినిమా కాంత పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సెల్వమణి సెల్వరాజ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ పాన్ ఇండియా సినిమా నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్, టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీని నవంబర్ 14న విడుదల చేస్తున్నారు.

ఇటీవలే రేజ్ ఆఫ్ కాంత ట్రాక్‌ను విడుదల చేయగా సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ సాయంత్రం 4 గంటలకు తొలిమెరుపు ఉండబోతుందని నేడు కొత్త పోస్టర్ లాంచ్ చేశారు.



దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని రోల్స్‌తో డిజైన్ చేసిన పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇంతకీ ఆ తొలి మెరుపు ఏంటనేది క్లారిటీ రానుంది. ఇప్పటికే కాంత మూవీ నుంచి అమ్మాడివే సాంగ్‌ను విడుదల చేశారని తెలిసిందే. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే కాంబోలో వచ్చే ఈ మెలోడీ ట్రాక్ మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. భారతీయ సినిమాలో 1960ల నాటి గత యుగానికి నివాళిగా తెరకెక్కుతున్న కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

## కానిస్టేబుల్ కనకం మళ్లీ వచ్చేస్తుంది..

### సీక్వెల్‌పై మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్



టాకీస్: మిడిల్ క్లాస్ మెలోడీస్, పుష్పక విమానం, ఊరు పేరు భైరవకోన సినిమాతో తెలుగు ప్రేక్షకుల్లో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది వర్ష బొల్లమ్మ . ఈ బెంగళూరు భామ టైటిల్ రోల్‌లో నటించిన వెబ్ సిరీస్ కానిస్టేబుల్ కనకం. ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వం వహించాడు. క్రైం ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ వెబ్‌సిరీస్ పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతుండగా అద్భుతమైన స్పందన వచ్చింది. 1990ల కాలంలో శ్రీకాకుళంలోని రేపల్లెలో అడవి గుట్ట, మహిళల మిస్సింగ్ నేపథ్యంలో ట్విస్టులతో థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సాగే ఈ ప్రాజెక్ట్ క్లైమాక్స్‌లో సెకండ్ సీజన్ ఉండబోతుందని హింట్ ఇచ్చింది. అంతా అనుకున్నట్టుగా ఇక




సీజన్ 2 కూడా వచ్చేస్తుంది.
కానిస్టేబుల్ కనకం 2 వచ్చే నెలలో విడుదల కానుంది. డబుల్ ఫైర్‌తో కానిస్టేబుల్ కనకం తిరిగి రాబోతుంది..అని ట్వీట్ చేశారు మేకర్స్. త్వరలోనే అధికారిక విడుదల ఎప్పుడనేది స్పష్టత ఇవ్వనున్నారు మేకర్స్. ఈ ప్రాజెక్టులో రాజీవ్ కనకాల, శ్రీనివాస్ అవసరాల, రమణ భార్గవ్, కంచరపాలెం కిశోర్, జ్వాల కోటి, రాకేందు మౌళి ఇతర నటీనటులు కీలక పాత్రల్లో నటించారు. కోవెలమూడి సత్య సాయిబాబా, వేమూరి హేమంత్ కుమార్ నిర్మించారు. మరి రెండో పార్ట్ ఎలాంటి ట్విస్టులతో ఉండబోతుందనేది తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.